రైతుబజారు సర్వం సిద్ధం

- 26న ప్రారంభోత్సవానికి సన్నాహాలు
- మూడు దశాబ్దాల నిరీక్షణ ఫలించే వేళ..
- స్థానికుల హర్షాతిరేకాలు

నిధులు : రూ.78 లక్షలు
ఆకుకూరలు, కూరగాయల దుకాణాలు : 47
ప్రొవిజన్ స్టోర్స్ : 10


పూర్తయిన ప్రొవిజన్ దుకాణాలు



చిట్టివలస రైతుబజారు ముఖద్వారం

తగరపువలస: చిట్టివలసలో రైతుబజారు నిర్మాణం దాదాపు పూర్తయింది. ఈ నెల 26న దీనిని ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. 1983 నుంచి ఈ ప్రాంతంలో రైతుబజారు నిర్మాణం కోసం ఇక్కడి ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు 2021లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు రూ.78 లక్షలతో నిర్మించడానికి శిలాఫలకం వేశారు. ఈ రైతుబజారులో 47 ఆకుకూరలు, కూరగాయల దుకాణాలు, 10 ప్రొవిజన్ స్టోర్లు, టాయిలెట్లు, ఆర్వో ప్లాంట్, స్టోర్ రూమ్, ఆఫీసు రూమ్, కాపలాదారునికి గదులు నిర్మించారు.

ఆ కష్టాలకు ఇక చెక్...

మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న ప్రైవేట్ మార్కెట్ కారణంగా ప్రస్తుతం వాహనదారులు ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారు. కార్మికవాడలో రైతుబజారు లేని కారణంగా చుట్టుపక్కల వినియోగదారులు అధిక ధరలకు కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేయవలసి వస్తుంది. విశాఖ, విజయనగరంతో పోలిస్తే ప్రస్తుతం ప్రైవేట్ మార్కెట్‌లో కిలోకు రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా వినియోగదారులు చెల్లించలసివస్తోంది. 40 ఏళ్లుగా భీమిలి ప్రజలకు టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతుబజారు నిర్మాణం కోసం వాగ్దానాలు చేసినా నెరవేర్చలేకపోయారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి విడతలోనే స్థానికుల బాధలు తెలుసుకుని రైతుబజారు అందుబాటులోకి తీసుకురావడంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కూరగాయల దుకాణాలు

క్లుప్తంగా

22న సహస్ర దీపాలంకరణ

కొమ్మాది: శ్రీ రామ జన్మభూమి అయోధ్యలో రామాలయ ప్రతిష్ఠ వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 22న సోమవారం స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. ఆలయంలోని శ్రీ రామచంద్రుని ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పారాయణ జరుపుతామన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి సహస్ర నామ దీపాలంకరణ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యా సదస్సుకు డైట్ వైస్ ప్రిన్సిపాల్ రవి



భీమునిపట్నం: పాఠశాల విద్యాశాఖ, ఇండియా టుడే గ్రూప్‌తో కలిసి తిరుపతిలో ఈ నెల 23, 24న నిర్వహించే విద్యా సదస్సుకు ఇక్కడి జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ శనివారం తెలిపారు. విద్యా వ్యవస్థ స్థాయిని పెంచేందుకు ఎంపిక చేసిన ముఖ్య అధ్యాపకులు, నిపుణులతో చర్చించి భవిష్యత్తులో వీరి సూచనలు, సలహాలు పొందడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. అలాగే విద్యలో డిజిటల్ విప్లవం, రాష్ట్ర విద్య బోర్డు విధానాలు, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

శరవేగంగా కుల గణన


సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం సచివాలయం – 2 పరిధి తిమ్మాపురంలో కుల గణన శనివారం శరవేగంగా కొనసాగింది. ఈ నెల 28 వరకు సర్వే కొనసాగుతుందని, ఇళ్ల వద్ద అందుబాటులో లేనివారికి ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 2 వరకు సచివాలయాల్లో వివరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు సిబ్బంది తెలిపారు.

వైఎస్సార్ బీమా అందజేత


జ్యోతి ఆదిత్య స్వరూప్‌కు బీమా సొమ్ము అందిస్తున్న అక్కరమాని రామునాయుడు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు రజక సంతపేటలో వాసం జ్యోతి ఆదిత్య స్వరూప్‌కు వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ.10 వేలు పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు శనివారం అందించారు. ఇటీవల స్వరూప్ తండ్రి గోవింద్ రమేష్ చనిపోయిన సంగతి తెలిసిందే. మిగిలిన సొమ్ము త్వరలో స్వరూప్ బ్యాంక్ ఖాతాలో జమ కానుంది. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జీవీ రమణ, సంతపేట సచివాలయ అడ్మిన్ నవ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీదేవి, వలంటీర్ తాటిపూడి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం


బేవాచ్ పార్కులోకి దూసుకొచ్చిన కారు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో పెను ప్రమాదం తప్పింది. శనివారం ఉదయం ఓ కుటుంబం కారులో తొట్లకొండ పైనుంచి కిందకు దిగుతూ వైజాగ్ వెళ్లేందుకు టర్న్ తీసుకోగా... ఆ కారు అదుపు తప్పి తొట్లకొండ ఎదురుగా ఉన్న బేవాచ్ పార్కులోకి దూసుకొచ్చింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ముఖ్యమంత్రి జగన్‌తోనే సంక్షేమ పాలన

మధురవాడ: కులం, మతం, పార్టీ వంటి ఏ రకమైన వివక్ష లేకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న నాయకుడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెం ఎస్సీ కాలనీ, సాయిప్రియ లే అవుట్ తదితర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని నివాసాల వద్దకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి భరోసా ఇస్తూ, ప్రభుత్వం ద్వారా జరిగిన మేలుకు సంబంధించిన కరపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం హామీలే తప్ప చేసింది ఏమీ లేదన్నారు. గతంలో ఏ పని జరగాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ప్రస్తుతం తనతోపాటు, అధికారులు, నాయకులంతా ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. బక్కన్నపాలెం మెయిన్ రోడ్డుతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. ఈ సందర్భంగా రేవళ్లపాలెంలో టీడీఆర్ సమస్యలు, బక్కన్నపాలెం శివారు ఎస్సీ కాలనీలో రోడ్లు, కాల్వలు తదితర సమస్యలు ఆయన దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ చీఫ్ విప్, వార్డు కార్పొరేటర్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక, వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి, డీఈ వంశీ, ఏఈ సురేష్, 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, సచివాలయ కన్వీనర్ రాయిన సాయి, బంక పోతురాజు, పోతిన శివ, పోతిన నాని, వాండ్రాసి సూరి అప్పారావు, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల నాయకులు సియాద్రి కనకరాజు, శివ, పీకేఎం పాత్రుడు, పిళ్లా సూరిబాబు, బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

బూజు పట్టిన బ్రెడ్‌ల విక్రయాలపై ఆందోళన

తగరపువలస: ఇటీవల వరుసగా స్థానిక ఫుడ్‌కోర్టులో బూజు పట్టిన బ్రెడ్‌లు విక్రయిస్తుండడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భీమిలి మండలం అమనాం పంచాయతీకి చెందిన వారు తగరపువలసలోని ఫుడ్‌కోర్టులో ఈ నెల 14న కొన్ని బ్రెడ్‌లు కొనుగోలు చేశారు. బూజు పట్టినవి రావడంతో ఫుడ్‌కోర్టుకు వెళ్లగా మార్చడానికి యాజమాన్యం తిరస్కరించింది. తిరిగి అదే పంచాయతీకి చెందిన మరికొందరు అదే ఫుడ్‌కోర్టులో ఈ నెల 19న మళ్లీ కొన్ని బ్రెడ్‌లు కొనుగోలు చేశారు. తిరిగి బూజు పట్టిన బ్రెడ్‌లనే ఫుడ్‌కోర్టు యాజమాన్యం విక్రయించడంతో బాధితులు ఈ విషయంపై జీవీఎంసీ, సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నా తగరపువలస దుకాణాల్లో ఎలాంటి తనిఖీలు చేపట్టకపోడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శరణ్యకు చిరంజీవి అభినందనలు


చిరంజీవితో నాట్య కళాకారిణి శరణ్య

మధురవాడ: మధురవాడ పిలకవానిపాలెంకు చెందిన కూచిపూడి నాట్య కళాకారిణి సంపతిరావు శరణ్యను మెగాస్టార్ చిరంజీవి శనివారం అభినందించారు. ఎన్‌టీఆర్ 28వ పుణ్యతిథి, ఏఎన్‌ఆర్ శత జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ బాలిక చక్కనైన నృత్యం ప్రదర్శించి అందరినీ అకట్టుకుంది. దీంతో శరణ్యకు చిరంజీవి సాలువా కప్పి అభినందించారు.

టెర్రస్ గార్డెన్ పరిశీలన

మధురవాడ: ఇంటినే వ్యవసాయ క్షేత్రంగా మార్చుకుని 60 గజాలు విస్తీర్ణంలో మేడపై సేంద్రియ పద్ధతిలో వందకు పైగా మొక్కలు పెంచుతున్న మధురవాడకు చెందిన జానూస్ నేచర్ వ్యవస్థాపకురాలు బంగారు ఝాన్సీని విశాఖ రూరల్ మండల తహసీల్దార్ సనపల రమణయ్య అభినందించారు. ఆమె ఇంటి మేడపై సాగు చేస్తున్న టెర్రాస్ గార్డెన్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఝాన్సీని ఆదర్శంగా తీసుకుని గృహిణులు ఇళ్లను వ్యవసాయ క్షేత్రాలుగా మార్చుకుంటే నగరం నందనవనం అవుతుందన్నారు. కార్యక్రమంలో బంగారు ప్రకాష్, తెంటు మాధవి పాల్గొన్నారు.


మేడపై సాగు చేసిన మొక్కలు పరిశీలిస్తున్న తహసీల్దార్ రమణయ్య

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

విశాఖ విద్య: జీవీఎంసీ పరిధిలోని విశాఖ, భీమిలి, అనకాపల్లి డివిజన్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతి పత్రం అందజేశారు. జీపీఎఫ్ నగదు ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాల్లోకి తక్షణమే జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2014 డీఎస్సీ ఉపాధ్యాయుల నియామక తేదీల్లో మార్పు చేయాలన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి, విశాఖ జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శులు గొంది చిన్నబ్బాయి, టి.ఆర్ అంబేడ్కర్, అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, విశాఖ జిల్లా కోశాధికారి రాంబాబు, నాయకులు ఎం.రాజునాయుడు, శోభ తదితరులు పాల్గొన్నారు. వినతి పత్రాన్ని పరిశీలించిన కమిషనర్ తగు చర్యలు తీసుకుని, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మూర్తిబాబుకు ముత్తంశెట్టి పరామర్శ

మధురవాడ: అనారోగ్యంతో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకున్న వైఎస్సార్ సీపీ 6వ వార్డు యువజన విభాగం అధ్యక్షుడు పోతిన మూర్తిబాబును ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం సాయంత్రం పరామర్శించారు.

బక్కన్నపాలెంలో గల మూర్తిబాబు ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనవెంట కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు, రాయిన సాయి, పీకేఎం పాత్రుడు, బగాది లక్ష్మణ ఉన్నారు.

సేద్యానికి సాంకేతిక సాయం

అధికారులకు జేసీ విశ్వనాథన్ ఆదేశం

మహారాణిపేట: ఆధునిక సాంకేతిక సహకారంతో రైతులకు మెరుగైన సేవలందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. తన చాంబర్‌లో శనివారం జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి, ధాన్యం కొనుగోలు సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా జేసీ.. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు. వ్యవసాయ, అనుబంధ రంగాల రైతులకు సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 10 ప్రాక్యూర్ సెంటర్లలో ఆరు వేల టన్నులకు గానూ 4,280 టన్నులు ప్రాక్యూర్ చేసినట్లు గుర్తు చేశారు. ఫిబ్రవరి రెండో వారంలోగా లక్ష్యాలను సాధించాలన్నారు. ఫిబ్రవరి 15లోగా రబీలో వేసిన పంటను మొత్తం ఈ క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. అర్హత కలిగిన వారికి పంట రుణాలు రెన్యువల్ చేయాలని ఆదేశించారు. ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండాలన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీఏ ప్రసాద్‌రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి, మండల, గ్రామ స్థాయిలో చర్చించిన విషయాలను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. పశు సంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ, అసిస్టెంట్ ఎల్.డి.ఎం.రమణబాబు, పౌర సరఫరాల కార్పొరేషన్ డీఎం రాజేశ్వరి, ఉద్యానవన శాఖ అధికారి మన్మధరావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

భీమిలి తీరంలో భారీ డాల్ఫిన్ కళేబరం

భీమునిపట్నం: భీమిలి తీరానికి శనివారం సాయంత్రం భారీ డాల్ఫిన్ కళేబరం కొట్టుకొచ్చింది. రెండు రోజుల కిందట ఇది చనిపోయి ఉంటుందని స్థానిక మత్స్యకారులు భావిస్తున్నారు. సముద్ర ఉపరితలంపై ఉష్ణోగ్రతల్లో మార్పులు, కాలుష్యం కారణంగా ఇది మృతి చెంది ఉంటుందని చెబుతున్నారు.



ప్రతిభను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్ర'

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడానికే ప్రత్యేకించి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి జోన్ పరిధి, మండల స్థాయిలో కొద్ది రోజులుగా జరుగుతున్న వివిధ పోటీల ముగింపు సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లోనూ ఎంతో నైపుణ్యం, ప్రతిభ కలిగిన క్రీడాకారులున్నారని, వారిని గతంలో ఎవరూ పట్టించుకోలేదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించి ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడానికి పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుతం గెలుపొందిన వారు ఈ నెల 24 నుంచి 30 వరకు జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటాలని కోరారు.

అనంతరం విజేతలకు కిట్లు అందించారు. కార్యక్రమంలో 4వ వార్డు కార్పొరేటర్ దొలుపల్లి ఏడుకొండలు, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, సర్పంచ్‌లు సమ్మిడి శ్రీను, గాడు వెంకట నారాయణ, బొడ్డు దుర్గారావు, కోటి రెడ్డి, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఎంపీడీవో డాక్టర్ జానకి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


గెలుపొందిన క్రీడాకారులకు కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

డీవీస్ హెల్పర్ అదృశ్యం

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీలో హెల్పర్‌గా విధులు నిర్వర్తిస్తున్న లావేటి దిలీప్‌కుమార్ ఈ నెల 17న అదృశ్యమయ్యాడు. శ్రీకాకుళం జిల్లా గార మండలానికి చెందిన ఈయన దివీస్‌లో పనిచేస్తూ చిట్టివలస శివారు శ్రీరామనగర్‌లో భార్యతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈ నెల 16న పండగ నిమిత్తం భార్యతో అత్తవారింటికి వెళ్లి తిరిగి ఒక్కడే 17న శ్రీరామ్‌నగర్ చేరుకున్నాడు. భార్య ఫోన్ చేసినా సమాధానం లేకపోవడంతో ఆమె గారలో ఉన్న అత్తకు సమాచారం చేరవేసింది. కన్నయ్యమ్మ శ్రీరామ్‌నగర్ వచ్చి విచారించగా డ్యూటీకి వెళ్లిన దిలీప్‌కుమార్ తిరిగి రాలేదని ఇంటి యజమాని తెలిపాడు. అతని ద్విచక్రవాహనం మాత్రం ఇంటి వద్దే పార్కింగ్ చేసి ఉన్నట్టు గుర్తించింది. ఈ క్రమంలో తల్లి ఫిర్యాదు మేరకు భీమిలి ఏఎస్ఐ జి.వెంకటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


లావేటి దిలీప్‌కుమార్

ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి సన్మానం

తగరపువలస: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతిగా రెండోసారి నియమితులైన పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని శనివారం ఆయన కార్యాలయంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి కలిసి సన్మానించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయాన్ని సర్వతోముఖాభివృద్ధి చేసిన ఘనత ప్రసాదరెడ్డికే దక్కుతుందన్నారు. ఆయనతోపాటు భీమిలి రెండో వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, తెడ్లాపు అప్పలరాజు, కొండపు సూరిబాబు పాల్గొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.


ఏయూ వీసీ ప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ అప్పలరెడ్డి తదితరులు

వైఎస్సార్‌సీపీకి బాసటగా శిష్టకరణాలు

పీఎం పాలెం : వైఎస్సార్ సీపీకి బాసటగా శిష్టకరణాలు నిలుస్తారని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణనలో శిష్టకరణాలుగానే పేర్లు నమోదు చేసుకోవాలని రాష్ట్ర శిష్టకరణాల అసోసియేషన్ అధ్యక్షుడు దొంకాడ అనిల్ కుమార్ అన్నారు. పీఎం పాలెంలో సంఘ నాయకులు శనివారం సమావేశం నిర్వహించారు. కులానికి సంబంధించి ఆధార్ కార్డు వివరాలు పొందుపరిచిన తర్వాత కులం శిష్టకరణంగా వెబ్‌సైట్‌లో నిర్ధారణ అయిందో..? లేదో..? చూసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికతోట చంద్రమౌళిని సంప్రదించాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్, మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి, ఉపాధ్యక్షులు శేఖర్ మహంతి శ్రీనివాస్, ఎస్ఎస్ రావు, సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్ పట్నాయక్, మంత్రి మూర్తి, దదిరావు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై విస్తృతంగా అవగాహన

మధురవాడ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున ఈవీఎంల పనితీరుపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్టు విశాఖ రూరల్ మండల తహసీల్దార్ సనపల రమణయ్య చెప్పారు. ఈవీఎంలు ఎంతో పారదర్శకంగా పనిచేస్తున్నాయన్నారు. కొన్ని చోట్ల వీటిపై కొందరికి ఉన్న అనుమానాలు నివృత్తి చేయడానికి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ల పనితీరు వివరించడంతోపాటు నమూనా పోలింగ్ కూడా నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఓ వాహనం ద్వారా విశాఖ తూర్పు నియోజకవర్గంలో ప్రచారం కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలు డిప్యూటీ తహసీల్దార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నామన్నారు. ఎవరికైనా అనుమానాలుంటే నివృత్తి చేసుకోవచ్చని సూచించారు.

బాలరాముడి వర్ణ చిత్రాల పోటీకి ఆహ్వానం

మహారాణిపేట: అయోధ్య రామాలయంపై దేశం మొత్తం మాట్లాడుకుంటున్న తరుణంలో చిన్నారులను ఈ సంబరాల్లో భాగస్వాములను చేయాలని వేద విజ్ఞాన సమితి నిర్ణయించింది. వారి కోసమే బాలరాముడి వర్ణచిత్రాల పోటీ నిర్వహించి, మొదటి ముగ్గురు విజేతలకు రూ.1,116 బహుమతిగా అందించడంతోపాటు పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలనూ అందించనుంది. ప్రముఖ చిత్రకారులు నుదురుపాటి అప్పల నరసయ్య (సయ్య మాస్టర్) పోటీల వివరాలను వెల్లడించారు. 6 నుంచి 15 ఏళ్ల మధ్య గల పిల్లలు బాలరాముడు వర్ణ చిత్రాన్ని గీసి, ఫొటో తీసి ఈ నెల 21లోపు 81256 74182కు వాట్సాప్ చేయాలని కోరారు. విజేతలను 22న ప్రకటిస్తామని తెలిపారు.